సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చూడాలి

మంత్రి చామకూర మల్లారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలన్నీ అర్హులైన వారికి అందేలా చూడాలని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నీ సత్వరమే పూర్తి చేయాలని, ఈ విషయంలో తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఘట్‌కేసర్‌లోని ఆర్వోబీని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను త్వరితగతిన అందించేలా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులైన వారికి స్థలాలు, నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించి ప్రారంభోత్సవ కార్యక్రమాలని చేపట్టాలన్నారు. రెండో విడత దళిత బంధుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకొచ్చి మరింత అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను రూపొందించారని, ఈ జాబితాను మంత్రికి అందజేస్తామని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఘట్‌కేసర్ ఆర్వోబీ పనులను త్వరగా పూర్తి చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కీసర ఆర్డీవో రవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి గ్రూప్-4 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో శనివారం జరిగే గ్రూప్-4 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, టీఎస్పీఎస్సీ సూచనలకు అనుగుణంగా ముందస్తు కార్యాచరణతో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 పరీక్షల నిర్వహణపై హైదరాబాద్ నుంచి టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, సభ్యులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం నిర్వహించే గ్రూప్-4 పరీక్షల నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్లకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 56 రూట్లలో గ్రూప్-4కు సంబంధించి 90,220 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తుండగా, 187 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వసతులు కల్పించామన్నారు. దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఎలక్ట్రానిక్ వాచ్, సెల్‌ఫోన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు(పాన్ కార్డు మినహా) వెంట తీసుకురావాలని తెలిపారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, డీఆర్‌ఓ లింగ్యానాయక్, ఆర్డీఓ రవి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

గ్రూప్-4 పరీక్షకు ప్రత్యేక బస్సులు

మేడ్చల్: మేడ్చల్ డిపో పరిధిలోని సీఎంఆర్, మల్లారెడ్డి, సెయింట్ మార్టిన్స్, సెయింట్ పీటర్స్, హితం, నర్సింహారెడ్డి కళాశాలల్లో శనివారం గ్రూప్-4 పరీక్ష నిర్వహిస్తునందున అదనపు బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. 229, 227, 233 రూట్లలో అధికంగా బస్సులు తిరుగుతాయని చెప్పారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో చేరేందుకు 5న ఎంపిక శిబిరం

మేడ్చల్: హకీంపేట్‌లోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో చేరేందుకు మండల విద్యార్థులకు ఈ నెల 5వ తేదీన ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వసంతకుమారి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. 4వ తరగతి ప్రవేశాల కోసం 2014-2015 మధ్యలో జన్మించిన పిల్లలు అర్హులని తెలిపారు. పుట్టిన తేదీ ధ్రువపత్రం, 10 ఫొటోలు ఆధార్ కార్డు, కుల ధ్రువపత్రంతో హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్: 84988 88616, 92904 96443.

సీఎంఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్


అడప మహేందర్

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాల అధ్యాపకుడు అడప మహేందర్‌కు జేఎన్‌టీయూహెచ్ డాక్టరేట్ పట్టా దక్కింది. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న అడప మహేందర్ జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ సాహు చక్రపతి పర్యవేక్షణలో క్లౌడ్ కంప్యూటింగ్‌లో మేనేజ్‌మెంట్ ఆఫ్ క్లౌడ్ బేస్డ్ రీసోర్సెస్ ఆన్ వర్చుల్ మెషిన్స్ అండ్ నెట్‌వర్క్స్ ఫర్ అప్లికేషన్స్ అండ్ డాటా అనే అంశంపై పరిశోధనకు గాను శుక్రవారం జేఎన్‌టీయూ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు సీఎంఆర్ కళాశాల యాజమాన్యం, డైరెక్టర్ రాజిరెడ్డి, అధ్యాపకులు ఆయనను అభినందిచారు.

గుండ్లపోచంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మరిలు



మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా జ్ఞానాపూర్‌కు చెందిన మరిలు నియమితులయ్యారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనాల లక్ష్మీ నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి సమక్షంలో మరిలుకు నియామక పత్రాన్ని అందజేశారు. మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పటిష్టతకు మరింత కృషి చేస్తానని అన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ



మేడ్చల్: దాతలు అందజేసే పుస్తకాలు, స్కూల్ బ్యాగులను మండల విద్యాధికారి వసంత కుమారి విద్యార్థులకు అందజేశారు. లింగాపూర్ పాఠశాల విద్యార్థులకు గ్రామ సమీపంలోని ఆయిస్టర్ కంపెనీ యాజమాన్యం స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్‌ను విరాళంగా అందజేయడంతో వాటిని ఎంఈఓ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రామాల్లో ఉన్న కంపెనీల యాజమాన్యాలు పేద విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయం అన్నారు.

అత్యవసర పనులకు మొదటి ప్రాధాన్యం


పటేల్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, కౌన్సిలర్ శశికళ

చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: అత్యవసర పనులను మొదటి ప్రాధాన్యం ఉంటుందని చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 10వ వార్డు పటేల్‌నగర్‌లో స్థానిక కౌన్సిలర్ శశికళదేవేందర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.10 లక్షలతో ఇటీవల చేపట్టిన యూజీడీని పరిశీలించారు. అనంతరం వార్డులో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, ఆంజనేయులు, గోపాల్‌గౌడ్, విక్రాంత్‌రెడ్డి, రాఘవరెడ్డి, సురేశ్, స్థానికులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా గణేశ్


నియామకపత్రం అందుకుంటున్న చిట్టిమిల్ల గణేశ్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా మండలంలోని మునీరాబాద్ గ్రామ సర్పంచ్ చిట్టిమిల్ల గణేశ్ నియమితులయ్యారు. నగరంలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ ఈమేరకు శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గణేశ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా పద్మశాలీ కులస్తుల అభివృద్ధికి తాను చేసిన సేవలకు గుర్తింపు ఇచ్చి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పద్మశాలీలు సామాజిక, రాజకీయ ఎదుగుదలకు కృషి చేస్తానని తెలిపారు. అఖిల భారత సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

జీఓ 58, 59 దరఖాస్తుల పరిశీలన షురూ..

- క్షేత్రస్థాయిలో 41 బృందాలతో 41,292 దరఖాస్తుల విచారణ
- 15 మండలాల్లో రంగంలోకి దిగిన విచారణ బృందాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: సర్కారు ఆక్రమిత నివాస స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీఓ 58, 59 కింద రెండో విడతలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమానికి జిల్లా అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ ప్రత్యేక చొరవతో గతంలో జీఓ-58 కింద వచ్చిన 26,092 దరఖాస్తులు, జీవో 59 కింద వచ్చిన 15,200 దరఖాస్తులు కలిపి మొత్తంగా 41,292 దరఖాస్తుల విచారణలో 41 క్షేత్రస్థాయి బృందాలు విచారణ నిర్వహిస్తున్నాయి. ఈ బృందానికి వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

అత్యధిక దరఖాస్తులు ఇక్కడే..

- తెలంగాణలో అత్యధికంగా మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోనే 41,292 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. జీవో 58, 59లకు సంబంధించి ఇళ్ల పరిశీలనకు తప్పనిసరిగా డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ బృందంలో ఉండేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. క్షేత్రస్థాయి బృందం ఇంటి ఫొటో అప్‌లోడ్ చేయడం, జీవో నిబంధనల ప్రకారం ఉన్నాయా? లేదా చెక్ చేసుకోవడం , సేకరించిన ఆధారాలను ప్రత్యేకంగా రూపొందించిన 'మొబైల్ యాప్'లో నమోదు చేసి, వాటిని కలెక్టర్ లాగిన్ సిఫార్సు చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దరఖాస్తులను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మరో మారు పరిశీలించిన తర్వాత ఆమోదం లేదా తిరస్కరించే విధంగా చర్యలు తీసుకుంటారు.

గతంలో దరఖాస్తులిలా..

- మొదటి విడతలో(గతంలో) మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో జీఓ 59 సంబంధించి 33,258 దరఖాస్తులు రాగా, జీఓ 58 కింద వచ్చిన 38,058 దరఖాస్తులు వచ్చాయి. వీటిని గతంలోనే 80 బృందాలు క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి అర్హులైన వారి జాబితాను జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. అలాగే జీవో 59 కింద అర్హత సాధించిన దరఖాస్తుదారులకు సొమ్ము చెల్లించాలని రెవెన్యూ యంత్రాంగం నోటీసులు జారీ చేసింది. ఇందులో కొందరు సొమ్ము చెల్లిస్తుండగా, మరికొందరు సందిగ్ధంలో ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ శైలజారెడ్డి

మేడ్చల్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును జెడ్పీటీసీ శైలజా, సర్పంచ్ విజయానంద్‌రెడ్డి అందజేశారు. మండలంలోని శ్రీరంగవరం గ్రామానికి చెందిన దుబ్బ యాదగిరికి సీఎం సహాయ నిధి నుంచి రూ.50 వేలు మంజూరు కావడంతో ఆ చెక్కును శ్రీరంగవరం గ్రామంలో అందజేశారు. ఎంపీటీసీ ప్రకాష్, నాయకులు యాదయ్యగౌడ్, రాములు, రంగారెడ్డి, అమర్‌నాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలకు చేరేందుకు కృషి చేయాలి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసుకుని బయట ప్రపంచంలో అడుగుపెట్టే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు నిరంతరం కృషి చేయాలని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈసీఈ విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న వారికి మూడో సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సమాజహితం కోసం పాటు పడాలని, ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. సమావేశంలో కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, హెచ్‌ఓడీ పురుషోత్తం ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో ప్రాపర్టీ షో


ప్రాపర్టీ షో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మేయర్ వెంకట్‌రెడ్డి

పోచారం: గృహ కొనుగోలుదారుల సౌకర్యార్థం ప్రాపర్టీ షో ఏర్పాటు చేయడం అభినందనీయమని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. సమృద్ధి ఈవెంట్ ఆధ్వర్యంలో జులై 8, 9 తేదీల్లో పీర్జాదిగూడలోని శ్రీపళని కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న ప్రాపర్టీ షో బ్రోచర్‌ను అన్నోజిగూడలోని తులిప్స్ గ్రాండ్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే వేదికపై పలు సంస్థలు అభివృద్ధి చేసిన వెంచర్ల వివరాలు లభ్యమవుతాయన్నారు. తొలిసారిగా తూర్పు హైదరాబాద్‌లో ప్రాపర్టీ షో నిర్వహించడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ఆర్గనైజర్ కొంతం ఓంకార్‌రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, నాయకులు కొంతం అంజిరెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి పలువురు బిల్డర్లు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన కీసర సీఐ



కీసర: కీసర సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎ.వెంకటయ్య మంత్రి మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నగరంలోని మంత్రి మల్లారెడ్డి నివాసానికి వెళ్లిన సీఐ వెంకటయ్య మంత్రి మల్లారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి వివక్ష లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రం అందజేస్తున్న జంగయ్య

మేడ్చల్: బహుజన సమాజ్ పార్టీ మేడ్చల్ మండల అధ్యక్షుడుగా తుడుం సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు చీర్యాల జంగయ్య శుక్రవారం అందజేశారు.

శ్రీనిధి గుర్తంపు రద్దు చేయాలి


ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పోచారం: యాజమాన్యం కోటా సీట్లను అమ్ముకుంటున్న శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘ నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జేఏసీ అధికార ప్రతినిధి ఎర్రబెల్లి కృష్ణ మాదిగ, వేల్పుగొండ వెంకటేశ్, కాటం శివ, యుగంధర్, చాగంటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడి మృతి

పోచారం: అనారోగ్యంతో అన్నోజిగూడకు చెందిన పోచారం మున్సిపల్ కార్మికుడు స్వామిచారి శుక్రవారం మృతి చెందాడు. చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్ తదితరులు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి సబిత డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ భవనానికి భూమిపూజ


అంబేడ్కర్ భవనానికి శంఖుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: రాజ్యాంగం వల్లే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని, సీఎం కేసీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి శుక్రవారం మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్, ఎంపీపీ యెల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, ఎంపీడీఓ వాణి, దళితసేవ మండల అధ్యక్షుడు వజ్జెల మురళి, రైతుబంధు మండల కన్వీనర్ క్రిష్టారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, దళిత నాయకులు పాల్గొన్నారు.

పార్క్, జిమ్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయండి


జిమ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి తదితరులు

మేడ్చల్: పట్టణంలోని 12వ వార్డు అభివృద్ధికి మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందజేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. 12వ వార్డులో రూ.20 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్, పార్క్ నిర్మాణ పనులను ఆమె శుక్రవారం కౌన్సిలర్ ప్రియాంక మధుకర్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న పార్క్, జిమ్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వార్డు అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని కౌన్సిలర్ ప్రియాంక మధుకర్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, పాండుగుప్తా, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, నాగభూషణం, పాషా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.కోటి


మాట్లాడుతున్న చైర్ పర్సన్ ప్రణీత

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.కోటి కేటాయించినట్లు చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ చెప్పారు. శుక్రవారం ఆమె అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఓపెన్ నాలాలను మట్టితో కప్పడం, డ్రైనేజీ మరమ్మతులు, పైప్‌లైన్ రిపేర్లు, బోర్ల నిర్వహణ, లైమ్ పౌడర్ కొనుగోలు, పారిశుధ్య సిబ్బందికి సామాగ్రి, రెయిన్ కోట్‌లు, బోనాలకు ఏర్పాట్లు, పెయింటింగ్ వంటి అన్ని పనులకు కలిపి రూ.కోటి కేటాయించినట్లు చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం రూ.6 లక్షలు, పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణకు రూ.42,500 ఖర్చు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ స్వామి, డీఈ చిరంజీవులు, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి ఘనంగా వీడ్కోలు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాలలో శుక్రవారం అధ్యాపకురాలు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో 15 ఏళ్లుగా అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తించిన ఫాతిమా మేరి రిటైర్డ్ అవ్వడంతో సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కళాశాలకు ఫాతిమా అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తాం

కీసర: రాజకీయాలకు అతీతంగా నాగారం మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులోని సమస్యలను పరిష్కరించేందుకు అందరి సహకారంతో మున్సిపల్ పాలకవర్గం తీర్మానం మేరకే నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. నాగారం మున్సిపాలిటీని సమస్యలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, కౌన్సిలర్లందరూ సహకరించాలన్నారు. 20 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.3.5 కోట్ల నిధులు కేటాయిస్తూ సమావేశంలో తీర్మాణించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ వాణీరెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నాగారం మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

జోరుగా ఇంటింటికీ బీజేపీ


మేడ్చల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: బీజేపీ చేపట్టిన మహజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని 22వ వార్డులో 60,61,62 పోలింగ్ బూత్‌ల పరిధిలో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచి బీజేపీ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. తమిళనాడు బీజేపీ ఉపాధ్యక్షుడు కార్తికేయ, మున్సిపల్ అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, వంశీవిజయ్ వంజరి, శ్రీకాంత్, రాజు, నర్సింగ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.